
క్లుప్తంగా

ఉమామహేశ్వరుడికి విశేష పూజలు



ఫిరంగిపురం: మండలంలోని గరుడాచల పాలెంలోని అన్నపూర్ణ సమేత ఉమామహేశ్వరస్వామికి కార్తిక మాసాన్ని పురస్కరించుకొని ఆదివారం ఉదయం విశేష పూజలు అర్చకులు లక్ష్మీ నారాయణశాస్త్రి నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. సోమవారం విశేష అర్చనలు నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు. ఆలయంలోని మూడు అడుగుల ఎత్తున పార్థివ లింగం(మట్టితో), ఆరు అడుగుల ఎత్తులో శీత లలింగాలు ఏర్పాటు చేసి విశేష అర్చనలు నిర్వహిస్తామని చెప్పారు. లక్ష ఒత్తులతో ఆలయం చుట్టూ భక్తులు దీపాలు వెలిగిస్తారన్నారు. స్వామికి సహస్ర బిల్వ దళార్చనలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

యువకుడికి గాయాలు



తాడేపల్లిరూరల్ : మంగళగిరి, తాడేపల్లి పాత జాతీయ రహదారి వెంబడి ప్రకాష్ నగర్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు గాయాలపాలయ్యాడు. సేకరించిన వివరాల మేరకు.. విజయవాడ నుంచి మంగళగిరి వెళ్తున్న బొలెరో సడన్ బ్రేక్ వేయడంతో వెనుక టీవీఎస్ ఎక్స్ఎల్ మీద వస్తున్న ఫణీంద్ర వాహనాన్ని ఢీకొట్టాడు. ఫణీంద్ర రోడ్డుపై పడడంతో తల వెనుక భాగంలో తీవ్ర గాయమైంది. స్థానికులు ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

సైడ్ గ్రిల్ ధ్వంసం



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని సచివాలయం -3 పరిధిలోని డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్ వద్ద దివ్యాంగులు, వృద్ధులు వెళ్లేందుకు వీలుగా ఏర్పాటు చేసిన రోప్ వే సైడ్ గ్రిల్‌ను మందు బాబులు ధ్వంసం చేశారు. వివరాల మేరకు..గ్రామం శివారులో నివాస ప్రాంతాలకు దూరంగా కోనేరు సమీపంలో ఏర్పాటు చేసిన హెల్త్ క్లినిక్ మందు బాబులకు అడ్డాగా మారింది. దీంతో విచ్చలవిడిగా మందు తాగుతూ సీసాలు అక్కడనే పడేస్తున్నారు. మందుబాబులు రోప్‌వే సైడ్ గ్రిల్ (స్టీల్ రాడ్లతో తయారు చేసిన)ను పూర్తిగా ధ్వంసం చేశారు. దీంతో వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బందిపడే పరిస్థితి ఏర్పడిందని ఆరోగ్య సిబ్బంది చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి, తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

తూకంలో మోసాలు.. పది దుకాణాలపై కేసులు



తెనాలి: తూకంలో మోసాలకు పాల్పడే వ్యాపారులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తూనికలు, కొలతల శాఖ తెనాలి ఇన్‌స్పెక్టర్ బి. శేషసాయి హెచ్చరించారు. డెప్యూటీ కంట్రోలర్ టి.షాలేమ్‌రాజుఆదేశాలతో ఆదివారం పట్టణంలోని పలు ప్రాంతాల్లోని చికెన్, మటన్, కూరగాయల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తూకంతో పాటు మెషీన్లను పరిశీలించారు. మోసాలకు పాల్పడుతున్న పది మంది వ్యాపారులపై కేసులు నమోదు చేశారు. చినరావూరు తోట పరిసర ప్రాంతాలలో చికెన్, మాంసం దుకాణాల్లో మోసాలు జరుగుతున్నాయని గుర్తించి హెచ్చరించారు.

ఫ్లెక్సీ రహితమా..అదెక్కడ?

- నగరంలో ఎక్కడ చూసినా అనధికారిక వాల్ పోస్టర్లు, ఫ్లెక్సీలు
- మాటలకే పరిమితమైన ఫ్లెక్సీ రహిత నగరం
- ఆదాయాన్ని కోల్పోతున్న కార్పొరేషన్



నగర ప్రధాన రహదారి గౌతమ బుద్ధా రోడ్డులో ఫ్లెక్సీలు

మంగళగిరి: మంగళగిరి, తాడేపల్లి నగర పాలక సంస్థను ఫ్లెక్సీ రహిత నగరంగా తీర్చిదిద్దుతామని అధికారులు చెబుతున్న మాటలు..నీటి మూటలుగానే మిగిలిపోతున్నాయి. నగరంలోని ప్రధాన రహదారులపై అనధికార ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నా.. చర్యలు తీసుకోవడంలో అధికారులు వెనకడుగు వేస్తున్నారు. దీంతో పలు విమర్శలు వినిపిస్తున్నాయి. రాష్ట్రంలోనే రెండవ అతి పెద్ద కార్పొరేషన్‌గా మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థ ఉంది. సుమారు 3 లక్షల జనాభా నివశిస్తున్నారు.నగర పరిధిలోని పలు గ్రామాల ప్రజలు వ్యాపారం, పిల్లల చదువుల నిమిత్తం ఇక్కడ స్థిరపడ్డారు. రాజధాని అమరావతిలో పనులు, సచివాలయ ఉద్యోగులు ప్రతి రోజు వేలమంది వస్తుంటారు. దీంతో నగరం శరవేగంగా విస్తరిస్తోంది.

అనుమతులెక్కడ..?

మంగళగిరి నగరంలో యాడ్ బోర్డులు ఏర్పాటు చేసుకోవాలంటే నగర పాలక సంస్థ అనుమతులు తీసుకోవాల్సి ఉంది. ముందుగా సదరు యాడ్ ఏజెన్సీల నిర్వాహకులు రోడ్ల వెంబండి ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేసుకోవాలంటే స్థలాన్ని చూసుకుని టౌన్ ప్లానింగ్ అధికారులకు తెలియజేయాలి. టౌన్ ప్లానింగ్ అధికారులు అనుమతించిన చోట ఏర్పాటు చేసుకునే అవకాశముంది. బోర్డును బట్టి నగదు చెల్లించాల్సి ఉంటుంది. ప్రభుత్వ స్థలంలో అయితే దానికి కూడా ఆక్రమణ కింద నగదు ఇవ్వాలి. అదే సొంత భవనాలు, స్థలాల్లో అయితే బోర్డు సైజును బట్టి నగదు వసూలు చేస్తారు. ప్రతి ఏడాది నగర పాలక సంస్థకు పన్ను చెల్లించాల్సి ఉంటుంది.

చట్ట ప్రకారం చర్యలు...

ఇప్పటికైనా నగర పాలక సంస్థ అధికారులు స్పందించి, వెంటనే అనధికార ఫ్లెక్సీలను తొలగించడంతో పాటు నగర పాలక సంస్థకు ఆదాయం సమకూరేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. నగర పాలక సంస్థ కమిషనర్ ఆలీం బాషా మాట్లాడుతూ నగరంలో అనధికార ఫ్లెక్సీలు, బ్యానర్లు ఉన్నమాట వాస్తవమన్నారు. వీటిని తొలగించాలని ఇప్పటికే ఆదేశాలు జారీచేయడం జరిగిందన్నారు. మిగిలిన వాటిని పూర్తిగా తొలగించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రధాన రహదారులు, కూడళ్లలో అనుమతులు లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయరాదని కోరుతున్నామన్నారు. ఫ్లెక్సీ రహితనగరంగా తీర్చిదిద్దేందుకు రాజకీయ పార్టీలు, వాణిజ్య సంస్థలు, వ్యాపారులు సహకరించాలని కోరారు. ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకోవాల్సిన వారు అనుమతులు కోరితే అనుమతిస్తామని, అనధికార ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆదాయానికి గండి..

నగరంలో 30 పైగా యాడ్ ఏజెన్సీలు, 312 బోర్డులున్నాయి. వీటిని నగరంలో ప్రధాన రహదారులు, కూడళ్లలో ఏర్పాటు చేశారు. వీటి ద్వారా నగరపాలక సంస్థకు ఏడాదికి సుమారు రూ.25 లక్షలకు పైగా ఆదాయం సమకూరుతోంది. నగరంలో అనుమతులు తీసుకున్న యాడ్ ఏజెన్సీల బోర్డుల కంటే అనధికార ఫ్లెక్సీలు అధికంగా ఉన్నాయి. గౌతమ బుద్ధా రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్ సెంటర్, మార్కెట్ సెంటర్, తెనాలి రోడ్డు, రాజీవ్ సెంటర్, తెనాలి ఫ్లైఓవర్, మెయిన్ బజార్, ఆటోనగర్ తదితర ప్రాంతాల్లో రాజకీయ పార్టీలు, వాణిజ్య సంస్థలు ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తుంటారు. అధికారులు అప్పుడప్పుడు అనధికార ఫ్లెక్సీలు



తెనాలి రోడ్డు డివైడర్‌లో ఇలా..

ఏర్పాటు చేసే వారిపై చర్యలు తీసుకుంటామని చెబుతున్నా.. ఆచరణలో సాధ్యపడడం లేదు. దీంతో అధికంగా అధికార పార్టీ నాయకులు ప్రతి చిన్న కార్యక్రమానికి ప్రధాన రహదారులు, కూడళ్లలో అధికంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. దీని వల్ల నగర పాలక సంస్థ ఆదాయానికి గండి పడుతోంది.

మాయ మాటలు.. మోసపు హామీలు

- ఇదే సీఎం చంద్రబాబు నాయుడి నైజం
- ఇప్పటికైనా ఆయన నిజ స్వరూపం ప్రజలు తెలుసుకోవాలి
- క్షేత్రస్థాయిలో వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలి
- వైఎస్సార్ సీపీ మంగళగిరి సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి

మంగళగిరి: మాయ మాటలు.. మోసపు హామీలతో అధికారంలోకి వచ్చిన సీఎం చంద్రబాబు నాయుడు ప్రశ్నిస్తారనే భయంతో ప్రజలకు కనిపించకుండా తిరుగుతున్నారని మంగళగిరి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి విమర్శించారు. నగర పరిధిలోని ఆత్మకూరు జాతీయ రహదారి వెంట ఉన్న వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాలస్వామి రెడ్డి అధ్యక్షతన తాడేపల్లి ముఖ్య నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. వేమారెడ్డి మాట్లాడుతూ ఎన్టీఆర్‌తో పాటు ఎంతో మంది సీనియర్ నాయకులను మోసం చేసిన చంద్రబాబుకు ప్రజలను మోసం చేసి, ఓట్లు వేయించుకోవడం వెన్నతో పెట్టిన విద్య అన్నారు. తొలి నుంచి మోసం అబద్ధాలే చంద్రబాబు నైజం అన్నారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో సూపర్ సిక్స్‌లోని ఒక్క హామీనైనా నెరవేర్చాడా అని నిలదీశారు. చంద్రబాబు పేదలకు ఓట్ల కోసమే ఉపయోగించుకుంటాడని, అధికారంలోకి వచ్చిన అనంతరం కోటీశ్వరులు, కార్పొరేట్ సంస్థలకు మేలు చేయడమే కోసమే పని చేస్తాడని విమర్శించారు. చంద్రబాబు నైజాన్ని ప్రజలలోకి తీసుకెళ్లి వారికి నిజాలు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్త తీసుకోవాలని పిలుపునిచ్చారు. క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతం చేయడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన తండ్రి ఆశయాలతో పాటు పేద ప్రజల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తారన్నారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీతో ఎంతో మంది ప్రాణాలు నిలబెట్టారని, ప్రస్తుతం ఎక్కడైనా ఆరోగ్య శ్రీ పనిచేస్తుందా అని ప్రశ్నించారు. చంద్రబాబు పాలన, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలకు తేడాలను ప్రజలకు తెలియజేసి, ఎప్పుడూ ఎన్నికలు వచ్చినా వైఎస్సార్ సీపీని గెలిపించుకుని, వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పాటిబండ్ల కృష్ణమూర్తి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దొంతిరెడ్డి రామకృష్ణారెడ్డి, మాజీ కౌన్సిలర్లు ఈదులమూడి డేవిడ్ రాజు, గంగాధరరావు, ఎండీ గోరేబాబు, దర్శి విజయలక్ష్మి పాల్గొన్నారు.

అభివృద్ధి కాంక్షించే సామాజిక వర్గం గౌడ

ఘనంగా గౌడ వన సమారాధన



సినీ నటుడు సుమన్ సత్కరిస్తున్న గౌడ సంఘం నాయకులు

తాడేపల్లిరూరల్ : ఇప్పటం గ్రామంలోని మామిడి తోటలో తాడేపల్లి మండల గౌడ సంఘం గౌరవ అధ్యక్షుడు డాక్టర్ పలగాని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గౌడ వన సమారాధన ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పాల్గొని, మాట్లాడారు. వన సమారాధన జరుపుకోవడం చాలా సంతోషకరమన్నారు. గౌడ అంటే కల్లు గీతకు, వెనుకబడిన వర్గం కాదని, రాష్ట్రంలో అభివృద్ధిని కాంక్షించే పెద్ద సామాజిక వర్గమన్నారు. సర్దార్ పాపారాయుడి పౌరుషం, సర్దార్ గౌతు లచ్చన్న ధైర్యంతో ముందుక సాగాలన్నారు. ప్రముఖ సినీ నటుడు తల్వార్ సుమన్ మాట్లాడుతూ వన సమారాధన ఆత్మీయత, ఐక్యతకు ప్రతీకన్నారు. భవిష్యత్ తరాలకు కూడా మేలు చేకూర్చే వృక్షజాతిని సంరక్షించాలని కోరారు. ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ గౌడ జాతి నాయకత్వం పెరిగిందని, రాజకీయంగా అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. చాలామంది మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలుగా ఉన్నారని గుర్తు చేశారు. పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ.. అందరూ ఏకతాటిపై సోదర భావంతో ఒకరికొకరు సాయం చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. తాడేపల్లి మండల గౌడ సంఘం గౌరవ అధ్యక్షుడు డాక్టర్ పలగాని శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఇప్పటంలో గౌడ సంఘం ఎనిమిదవ వార్షికోత్సవం జరుపుకోవడం చాలా ఆనందదాయకమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ ఈవీ నారాయణ, గౌడ సంఘం నాయకులు లచ్చితులసి దాసు, కంచకర్ల కాశయ్య, పలగాని నాగబాబు, ఐఎఫ్ఎస్ అధికారి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జలజీవన్ మిషన్ పనులను వెంటనే కొనసాగించాలి



మాట్లాడుతున్న దుగ్గిరాల జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఆదివారం ఇన్‌చార్జి ఎంపీపీ షేక్ జబీన్ అధ్యక్షతన నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో మండలంలోని అన్ని గ్రామాలకు తాగునీటిని అందించేందుకు జలజీవన్ మిషన్ ద్వారా పనులు చేపట్టారని, అవి మధ్యలో నిలిచిపోయాయన్నారు. పనులు వెంటనే పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. గత ప్రభుత్వంలో రోడ్ల ప్యాచ్ వర్క్‌లకు నగదు మంజూరైందని, ఆ పనులను అధికారులు ఇప్పుడు చేస్తున్నారని తెలిపారు.కొత్త రోడ్ల నిర్మాణానికి అధికారులు సన్నద్ధం కావాలన్నారు. పంచాయతీ రాజ్ ఏఈ గోవర్ధన మాట్లాడుతూ రూ.3.35 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. పల్లె పండగ కార్యక్రమంలో వచ్చిన అర్జీల్లో 12 పనులను రూ.22.50 లక్షల వ్యయంతో చేపట్టినట్లు వెల్లడించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వేణుగోపాలస్వామి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం కల్పనకు నిధులు మంజూరు చేశామని చెప్పారు. డీసీఎంఎస్ ద్వారా ధాన్యం కొనుగోళ్ల ప్రారంభమవుతాయని, రైతులు ఆయా రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని ఏవో శిరీష తెలిపారు. దుగ్గిరాల–ఈమని రహదారి మరమ్మతులు త్వరగా పూర్తి చేయాలని వైఎస్ ఎంపీపీ సాయి చైతన్య కోరారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భవాని మండలంలో ఉన్న ఆరు అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ వాటిక, రెయిన్ హార్వెస్టింగ్ మంజూరైనట్లు తెలిపారు. మండలంలో రీ–సర్వే గ్రామ సభల్లో 400 అర్జీలు వచ్చాయని, త్వరలోనే ప్రభుత్వ ఆదేశాల మేరకు పరిష్కరించడం జరుగుతుందని డిప్యూటీ తహసీల్దార్ కనకదుర్గ చెప్పారు. నీటి తీరువా రైతులు జమ చేయాలని, సూర్య ఘర్ యోజన పథకం వివరాలు విద్యుత్ అధికారులు వివరించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ ఎ. శ్రీనివాసరావు, కార్యాలయ ఏఓ వడ్లమూడి చంద్రమోహన్, ఈఓపీఆర్డీ కె.జె.నెహ్రూ, ఏపీఎం రమేష్, ఏపీవో మధుబాల, విజయశ్రీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వాణి, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పెదవడ్లపూడి హైలెవల్ చానల్‌కు నిధులు కేటాయించాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు డిమాండ్



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు

తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండల పరిధిలోని పెదవడ్లపూడి హైలెవల్ చానల్‌కు ప్రభుత్వం నిధులు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు డిమాండ్ చేశారు. ఆదివారం మంచికలపూడి గ్రామంలోని వల్లభనేని సాంబశివరావు నగర్‌లో సీపీఎం ఆరవ మండల సమావేశం ఎం.నరసింహారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పాశం రామారావు మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నిత్యావసర వస్తువులు, పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు ఆకాశాన్నంటుతున్నాయని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాలను అమలు చేయాలని, ఉచిత ఇసుక విధానాన్ని వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. నూతన మద్యం విధానం పేరుతో బెల్టు షాపులను పెంచి రాష్ట్ర ప్రభుత్వం మద్యాన్ని ఆదాయ వనరుగా భావిస్తోందని వ్యాఖ్యానించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గంలో వేలాది మందికి ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్న పేదలకు పట్టాలు ఇస్తామని మంత్రి లోకేష్ చేసిన వాగ్దానం నిలబెట్టుకోవాలన్నారు. అనంతరం ఏడవ కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ కార్యదర్శిగా జెట్టి బాలరాజు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు వై.స్టాలిన్, వై.బ్రహ్మేశ్వరరావు, ఎస్.యోగేశ్వరరావు, ఎం.నాగమల్లేశ్వరరావు, సి.శ్రీనివాసరావు, అమ్మిరెడ్డి, చిరంజీవి పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు మార్కండేయ సొసైటీ అండ



మంగళగిరి: చేనేత కుటుంబాలలోని పేద విద్యార్థులను ఆదుకుని, వారిని ఉన్నత స్థితికి చేర్చడానికి మార్కండేయ సొసైటీ చేస్తున్న కృషి అభినందనీయమని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు కొనియాడారు. పట్టణంలోని తెనాలి రోడ్డులోని మార్కండేయ కల్యాణ మండపంలో ఆదివారం మార్కండేయ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో వందల మంది పేద విద్యార్థులకు నోటు పుస్తకాలు, నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ సొసైటీ నిధులతో విద్యనభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకున్న ఎంతో మంది మరలా ఎడ్యుకేషనల్ సొసైటీకి ఆర్థికంగా సహకరించాలని కోరారు. సొసైటీ ప్రతినిధులు జొన్నాదుల బాబూ శివప్రసాద్, మంచా విజయ్ మోహన్‌రావు, గంజి రవీంద్రనాథ్, ప్రెగడ రాజశేఖర్, తిరువీధుల రమణమూర్తి, కొల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సామూహిక సత్యదేవ వ్రతాలు



తెనాలి: పవిత్ర కార్తిక మాసాన్ని పురస్కరించుకుని స్థానిక లక్ష్మీ పద్మావతీసమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం, వైకుంఠపురంలో శ్రీ రమాసహిత సత్యదేవ వ్రతమహోత్సవాలను ఆదివారం భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. కార్తిక మాసంలో వరుసగా ప్రతి ఆదివారం వ్రత మహోత్సవాలు ఏటా నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీగా తెలిసిందే. ఇందులో భాగంగా 3వ ఆదివారం ఉదయం నుంచి జరిగిన వ్రతాల్లో 151 మంది దంపతులు పాల్గొన్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వి.అనుపమ, ట్రస్ట్ బోర్డు చైర్మన్ కుంభం సాయిబాబు నేతృత్వంలో దేవస్థానంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వ్రత మహోత్సవాల్లో పాల్గొనదలచిన దంపతులు రూ.1000 చెల్లించి పేర్లు, గోత్రం నమోదు చేయించుకోవాలని ఈవో అనుపమ తెలియజేశారు.ట్రస్ట్ బోర్డు సభ్యులు బొద్దులూరి సరస్వతి నాగేశ్వరరావు, కురగంటి సునీత రవిశంకర్, దేవరకొండ వెంకట రమణ శంకరరావు, ఎక్స్‌అఫీషియో సభ్యుడు అళహరి రవికుమార్, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

కొలనుకొండలో ఉచిత వైద్య శిబిరం



మందులు అందజేస్తున్న సంస్థ అధ్యక్షుడు సురేష్

తాడేపల్లిరూరల్ : మానవ సేవా సంస్థ ఆధ్వర్యంలో దుగ్గిరాల మండలం కొలనుకొండలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు వంగర సురేష్ మాట్లాడుతూ.. వైద్య శిబిరంలో వైద్యులు వంశీ, కొల్లి లోలినీ రూపా, శ్రీకర్, శశిధర్, మాధురి, వినోద్, కృష్ణలీల, శ్రావణి, చలసాని ప్రశాంత్, కమ్మెల హరీష్, రాధిక రాజశేఖర్ కుప్ప, మిథునేశ్వర్‌రెడ్డి, భార్గవ్ సుమారు 800 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిచి, మందులు అందజేశారని తెలిపారు. బీపీ, షుగర్, ఈసీజీ 2డీ ఎకో పరీక్షలు నిర్వహించారని చెప్పారు. టీడీపీ మండలాధ్యక్షుడు అనిత, రామకృష్ణ, నరసింహారావు, విజయ్ మహేంద్ర, హనుమార్, రవి, బాలకృష్ణ, విజయ్, సంస్థ సభ్యులు కోటేశ్వరరావు, ఆదినారాయణ, నరసింహారావు, విజయ్‌కుమార్, హనుమంతరావు, శ్రీనివాసరావు, సుధాకర్ పాల్గొన్నారు.

ఎన్నికల వాగ్దానాలను నెరవేర్చాలి



మాట్లాడుతున్న పల్లె కృష్ణ

తాడేపల్లిరూరల్ : గత ఎన్నికల వాగ్దానాలను కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు డిమాండ్ చేశారు. ఆదివారం వడ్డేశ్వరంలో సీపీఎం తాడేపల్లి మండల మూడవ మహా సభను పార్టీ సీనియర్ నాయకులు అమ్మిశెట్టి రంగారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పాశం రామారావు పార్టీ పతాకాన్ని సీనియర్ నాయకులు కంచర్ల జేమ్స్‌తో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాశం రామారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాలను విస్మరించిందన్నారు. సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలకు సంక్షేమ పాలన అందిస్తామని చెప్పి ఐదు నెలలు గడుస్తున్నా పథకాల ఊసే లేదన్నారు. ఉచిత ఇసుక విధానం అమలులోకి రాలేదని, తాడేపల్లి మండలంలోని సుమారు 2వేల మందికి పైగా భవన నిర్మాణ కార్మికులకు పనులు లేకుండా పోయాని విమర్శించారు. ట్రూఅప్ చార్జీలపేరుతో ప్రజల నెత్తిన విద్యుత్ భారం మోపేందుకు కూటమి ప్రభుత్వం పూనుకుందని మండిపడ్డారు. సీపీఎం గుంటూరు కార్యదర్శి వర్గ సభ్యుడు ఈమని అప్పారావు మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలను ఉద్ధరిస్తామని చెప్పిన తెలుగుదేశం ప్రభుత్వం ఎన్నికల తర్వాత ప్రజల సమస్యలు పట్టించుకోకుండా వ్యవహరిస్తోందన్నారు. పలు అంశాలను ఏకగ్రీవంగా తీర్మానించారు. తాడేపల్లి మండల నూతన కార్యవర్గం 11 మందితో ఏర్పాటైంది. మండల కమిటీ కార్యదర్శిగా పల్లె కృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జొన్న శివశంకరరావు, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, కాట్రగడ్డ శివరామకృష్ణయ్య, కాజా వెంకటేశ్వరరావు, నాగపోగు విజయరాజు, కంచర్ల సాంబశివరావు, గుడిసె శ్రీనివాసరావు, కొండపల్లి యశోద, కారసాల స్వాతి, గుంపెన వెంకటేశ్వరరావు, ఎస్‌కె పాపా సాహెబ్, గుడివాడ సామ్యవాదం, పల్లె భార్గవ్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

తెనాలి: జాతీయ ఫార్మసీ వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఏఎస్ఎన్ ఫార్మసీ కాలేజీ ఆధ్వర్యంలో బుర్రిపాలెంలోని ఇందిరాకాలనీ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. స్థానికులకు షుగర్, బీపీ, హెమోగ్లోబిన్, బ్లడ్ గ్రూపింగ్ పరీక్షలు చేసి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. వైద్యులు వివిధ పరీక్షలు నిర్వహించి, సూచనలు చేశారు.

ఉత్సాహంగా గ్రంథాలయ వారోత్సవాలు



చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



పాటల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



కవితా సంపుటిలో భాగంగా కవితలు చదువుతున్న కవి ఆనందరావు

తాడేపల్లిరూరల్ : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా.. తాడేపల్లి శాఖ గ్రంథాలయంలో సీనియర్స్ విభాగంలో ఆదివారం పర్యావరణం అనే అంశంపై చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా శ్రీను మాస్టర్ పోటీలను ప్రారంభించారు. చిత్రలేఖనం అంతర్ముఖ సృజనాత్మకతను వెలికితీయడానికి ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, గ్రంథాలయ అధికారి షేక్ నాగూర్ బాషా పాల్గొన్నారు.

– ఫిరంగిపురం: మండల కేంద్రంలోని గాలిబాలి శాఖా గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు పాటల పోటీలు నిర్వహించారు. ఫిరంగిపురంలోని పలు పాఠశాలల విద్యార్థులు 17 మంది పోటీల్లో పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతగా విశ్రాంత హెచ్ఎం కె. ఫ్రాన్సిస్‌రాజు వ్యవహరించారు. ఇన్‌చార్జి గ్రంథాలయాధికారి పి.జేమ్స్‌బాబు, బీడీఎల్‌డీలు డి.కృష్ణమూర్తి, షేక్.సైదాసాహెబ్ పాల్గొన్నారు.

– తాడికొండ: స్థానిక శాఖ గ్రంథాలయాధికారి జి.శ్రీనివాసరావు కవితా సంపుటి కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురు కవితలను సదివి వినిపించగా.. గ్రామానికి చెందిన కవి ఆనందరావు ఉత్తమ కవిగా, ఉత్తమ రీడర్‌గా వి.వెంకటేశ్వరరావును ఎంపిక చేశారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ తరుపున పారితోషికం అందజేశారు. మహిళా గ్రంథాలయ ఇన్‌చార్జి నాగమల్లేశ్వరి, రంగారావు, నరసింహారావు పాల్గొన్నారు.

– తుళ్లూరు శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు పాటల పోటీలు నిర్వహించారు. న్యాయ నిర్ణేతగా విద్యుత్ శాఖాధికారి సాంబశివరావు వ్యవహరించారు. 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు. గ్రంథాలయాధికారి టి.గిరిధర్‌కుమార్ పాల్గొన్నారు.

– మేడికొండూరు : స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారిని సుధారాణి పుస్తక ప్రదర్శన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. గ్రామ పెద్దలు గణేష్, గోపీ, అనంతలక్ష్మి పాల్గొన్నారు.

దంత సంరక్షణపై జాగ్రత్తలు అవసరం

తెనాలి: షుగర్ వ్యాధి బాధితులు ప్రతి ఆరు నెలలకు దంత పరీక్షలు చేయించుకోవాలని దంత వైద్యనిపుణురాలు (ఇంప్లాంటాలజీ) డాక్టర్ హిమబిందు ఓగిరాల సూచించారు. వాకర్స్‌క్లబ్, తెనాలి ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటైన సమావేశానికి క్లబ్ అధ్యక్షుడు గుత్తా వెంకటరత్నం అధ్యక్షత వహించారు. 'వృద్ధులు–దంత సమస్యలు–నివారణ' అనే అంశంపై డాక్టర్ హిమబిందు ప్రసంగించారు. దైనందిన జీవితంలో ఆహారం తీసుకున్న తర్వాత నీరు లేదా మౌత్ వాష్‌తో నోటిని శుభ్రం చేసుకోవాలని తెలిపారు. రోజుకు రెండుసార్లు బ్రష్ చేసుకోవాలని, లేనిపక్షంలో ఆహార పదార్థాలు పళ్లు, చిగుళ్ల మధ్య పేరుకుపోయి దంతక్షయానికి దారితీస్తుందని హెచ్చరించారు. ధూమపానం చేసేవారికి దంత సమస్యలు అధికంగా వస్తాయని తెలిపారు. షుగర్ బాధితులకూ దంత సమస్యలు అధికమని, ప్రతి ఆరు నెలలకు పరీక్షలు చేయించుకోవడం ఉత్తమమని చెప్పారు. సభ్యుల సందేహాలకు సమాధానాలిచ్చారు. కంపెనీ ప్రతినిధి రామాంజనేయులు గుండెపోటు వచ్చినప్పుడు తక్షణం చేయాల్సిన సీపీఆర్ విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు కాకుమాను రామమోహనరావు, అబ్బయ్య, సభ్యులు శ్రీనివాస్, నారాయణ, ప్రసాదరావు, మొవ్వా సత్యనారాయణ, రత్తయ్య పాల్గొన్నారు.